# సాక్షి నిర్మల్

ఆదివారం । 20 । ఆగస్టు । 2023







## ఉపాధి లడ్డూ!

- 8లో

ఆదివాసీ మహిళలు ఇప్పపువ్వు లడ్డూలు తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం ఆర్డర్లపై లడ్డూలను సరఫరా చేస్తున్నారు.

## హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

నిర్మల్ రూరల్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఆగస్టు 27న నిర్వహిస్తామన్నారు. www.bsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పరీక్షకు గంట ముందుగానే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.3 /23.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 2 యూనిట్లకు రూ.647 బిల్లు

- విద్యుత్ ఉద్యోగుల మాయాజాలం
- మీటర్ రీడింగ్ తీసుకోకుండానే బిల్లు



మీటర్‌లో శనివారం నాటికి ఉన్న రీడింగ్ 16314



ఈనెల 129 యూనిట్లకు రూ. 647.80 బిల్లు

భైంసా: విద్యుత్ ఉద్యోగుల మాయాజాలం కొనసాగుతోంది. భైంసా పట్టణంలోని పిప్రికా లనీలో విద్యుత్ సిబ్బంది మీటర్ల రీడింగ్ గుడ్డిగానే లెక్కిస్తున్నారు. పట్టణంలో 6262001527 సర్వీస్ నంబర్ పేరిట మీటరు ఉంది. యూ ఎస్‌సీ నంబర్ 15162920 కాగా, గతనెలలో 115 యూనిట్లు వినియోగించారు. ఇందుకుగాను రూ.580 బిల్లును జూలై 12న ఇచ్చారు. తిరిగి మళ్లీ ఆగస్టు 17న 129 యూనిట్లు వినియోగించినట్లు బిల్లులో పేర్కొంటూ రూ.647.80 పైసలు బిల్లులు ఇచ్చారు. గత బిల్లులు చెల్లించాక వినియోగదారుడు కరెంట్ వినియోగించలేదు. నెల రోజులు ఇంట్లో కూడా లేదు. గతనెల బిల్లు చెల్లించే నాటికి సంబంధిత సర్వీసు మీటర్‌లో 1,6312 యూనిట్లు వినియోగించగా, ఈనెలలో శనివారం వరకు 1,6314 యూనిట్లుగా ఉంది. నెలంతా రెండే యూనిట్లు వినియోగించినప్పటికీ బిల్లులో మాత్రం 129 యూనిట్లు వినియోగించినట్లు రసీదు ఇచ్చారు. వాడకపోయిన బిల్లులు ఎలా చెల్లించాలని బాధితుడు సిబ్బందిని ప్రశ్నించగా బిజీగా ఉన్నామని దాటేస్తున్నారు.

### ఒంటికాలిపై సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన



వర్షంలోనూ సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన..

నిర్మల్‌టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు శనివారం వర్షంలో గొడుగు పట్టుకుని ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### ఆర్టీసీ 'గమ్యం'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వెహికల్ ట్రాకింగ్ యాప్ గమ్యంపై ఆర్టీసీ సిబ్బంది శనివారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. పిల్లలు, బంధువులు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు మొబైల్‌లోనే బస్సు ఎక్కడుందో, ఎక్కడి వరకు వెళ్లిందో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతీ ప్రయాణికుడు tsrtcgamyam యాప్‌ను ఆన్‌డ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ నారాయణ, రిజర్వేషన్ ఇన్‌చార్జి రమణ, గంగన్న, పి. నారాయణ పాల్గొన్నారు.

### 'స్వర్ణ' రెండు గేట్లు ఎత్తివేత



గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

సారంగాపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. 7 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అప్రమత్తమైన అధికారులు శనివారం ఉదయం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు(1.484టీఎంసీ) కాగా, ప్రస్తుతం 1,179.6 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.

### 26న వన మహోత్సవం

నిర్మల్: స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా జిల్లాలో 4 లక్షలు నాటనున్నట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. మొక్కలు నాటేందుకు స్థల సేకరణ, గుంతల తవ్వకం చేపట్టాలని సూచించారు. డీఆర్డీఓ, అటవీశాఖ ఆధ్వర్యంలో 3 లక్షలు, ఇతర శాఖల ఆధ్వర్యంలో మరో లక్ష నాటాలన్నారు.

# కారు.. త'ఖరారు'!






గడ్డిగారి విఠల్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంత్రి



అజ్మీరా రేఖానాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే



భూక్య జాన్సన్‌నాయక్, ఖానాపూర్



జాదవ్ రాజేశ్‌బాబు, ముధోల్



గొల్లమాడ సూర్యకాంత్‌రావు, ముధోల్

- నిర్మల్, ముధోల్‌లో సిట్టింగ్‌లే..
- ఖానాపూర్‌కు కొత్త ముఖం..
- తెరపైకి జాన్సన్‌నాయక్ పేరు
- రేఖానాయక్‌కు ఎమ్మెల్సీ చాన్స్..!
- విఠల్‌రెడ్డిపై అసమ్మతిరాగం
- సీనియర్ నేతల ప్రయత్నం

నిర్మల్: ఎన్నికల సైరన్ మోగేందుకు సమయం దగ్గర పడుతుండటంతో కారు పార్టీ సీట్లను ఖరారు చేస్తోంది. దాదాపు 86 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఫైనల్ చేసినట్లు ఓ జాబితా బయటకొచ్చింది. ఈనెల 21న దీన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితా ప్రకారం జిల్లాలోని నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే సీటివ్వనుండగా, ఖానాపూర్‌లో సిట్టింగ్‌ను మారుస్తారని స్పష్టమవుతోంది. అజ్మీరా రేఖానాయక్‌పై తీవ్ర వ్యతిరేకత ఉండటంతో మంత్రి కేటీఆర్ మిత్రుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన జాన్సన్‌నాయక్‌కు టికెట్ ఖరారైనట్లు తెలుస్తోంది. రేఖానాయక్‌కు ఎమ్మెల్సీ చాన్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు ముధోల్ సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డికి టికెట్ ఇస్తే తాము పనిచేయలేమని అసమ్మతివర్గం గళం వినిపిస్తోంది. ఇక్కడి నుంచి మరో ఇద్దరు ముగ్గురు టికెట్ తమకే ఇవ్వాలంటూ రాయబారాలు కొనసాగిస్తున్నారు.

**'అల్లోల'కు నిర్మలమే..**

రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీలో సీనియర్లు, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసమ్మతి రోజురోజుకూ పెరుగుతోంది. నిర్మల్‌లో మాత్రం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి పార్టీ పరంగా ఇప్పటి వరకూ ఎలాంటి వ్యతిరేకత రాలేదు. ఆయన 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, అనంతరం కారెక్కారు. వెంటనే మంత్రి పదవి పొందారు. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి వరుసగా రెండోసారి గెలిచి, మళ్లీ మంత్రి పదవిని దక్కించుకున్నారు. పార్టీపరంగా నియోజకవర్గంలో ఎలాంటి వ్యతిరేకత, అసమ్మతి లేకపోవడం అల్లోలకు కలిసి వస్తోంది. ఈక్రమంలోనే ఈసారీ ఆయనకే బీఆర్ఎస్ టికెట్ దక్కుతోంది.

**విఠల్‌రెడ్డికి కిరికిరి..**

ఓవైపు అధిష్టానం సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికే ముధోల్ టికెట్ అని జాబితా వచ్చినా.. లోకల్‌గా మాత్రం అసమ్మతిగళం బలంగానే వినిపిస్తోంది. ముధోల్ నియోజకవర్గంలో కారు టైర్లు చెరోవైపు అన్నట్లుగా ద్వితీయ శ్రేణి నాయకులూ విడిపోయారు. పలువురు జెడ్పీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు ఎమ్మెల్యేపై తీవ్రవ్యతిరేకతను చాటుతున్నారు. ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. విఠల్‌రెడ్డికి టికెట్ ఇస్తే తాము పనిచేసే పరిస్థితి లేదని చెబుతున్నారు. మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వని పక్షంలో తమ పేర్లు పరిశీలనలోకి తీసుకోవాలంటూ నియోజకవర్గానికి చెందిన సీనియర్లు జాదవ్ రాజేశ్ బాబు, గొల్లమాడ సూర్యకాంత్‌రావు అధిష్టానంతో టచ్‌లో ఉన్నారు. ఇందులో రాజేశ్‌బాబు ఇప్పుడు ఎమ్మెల్యే టికెట్ రాకున్నా.. ఎంపీ సీటు దక్కుతుందన్న నమ్మకంతో పార్టీపెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్నారు. సీనియర్‌నేత సూర్యకాంత్‌రావు తనకున్న పరిచయాలతో టికెట్ కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యేవర్గం నాయకులు సీఎం కేసీఆర్ ఆశీస్సులు విఠల్‌రెడ్డికే ఉన్నాయని, నిలిచి గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### రేఖానాయక్‌కు ఎమ్మెల్సీ చాన్స్..!

ఖానాపూర్ సిట్టింగ్ స్థానాన్ని ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఇవ్వకుండా ఆమెకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చే చాన్స్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈమేరకు అధిష్టానం సూచనప్రాయంగా తెలిపిందని, మంత్రి సత్యవతి రాథోడ్ ద్వారా చెప్పించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా రేఖానాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడంతోపాటు ఆమె భర్త శ్యాం నాయక్‌కు మళ్లీ జిల్లా రవాణాశాఖాధికారి పోస్టును ఇచ్చేందుకు పార్టీ అధిష్టానం చర్చించినట్లు సమాచారం.

### జాన్సన్ వైపే మొగ్గు..

ఎస్టీ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు షాక్ తప్పదని తెలుస్తోంది. తాజాగా బయటకొచ్చిన జాబితాలో నియోజకవర్గం పేరు లేకపోవడం గమనార్హం. రెండో జాబితాలో రేఖానాయక్ పేరు ఉంటుందా.. లేక ఇప్పటికే ఇక్కడ జోరుగా ప్రచారం చేస్తున్న భూక్య జాన్సన్‌నాయక్‌కే టికెట్ వస్తుందా అనేది తేలాల్సి ఉంది. ఎమ్మెల్యే రేఖానాయక్ తన చేతులారా టికెట్‌ను దూరం చేసుకుంటున్నారని పార్టీవర్గాలే చెబుతుండటం గమనార్హం. ఇక ఐటీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దగ్గరి మిత్రుడైన జాన్సన్ నాయక్ వర్గం మాత్రం తమ నేతకు ఇప్పటికే పార్టీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టంగా చెబుతోంది. ఇందులో భాగంగానే ఆయన కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీ ప్రచారం చేస్తున్నారని పేర్కొంటోంది. ఇదే నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న ఎంపీ సంతోష్‌రావు అనుచరుడు పూర్ణచందర్‌నాయక్ లాస్ట్ వరకూ ఏదైనా మారవచ్చన్న ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

### మంత్రి సత్యవతి రాథోడ్‌తో చర్చలు



మంత్రి సత్యవతి రాథోడ్‌తో జిల్లా నేతలు

ఖానాపూర్: రాష్ట్ర సచివాలయంలో శనివారం పలు అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు మంత్రి సత్యవతి రాథోడ్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి భారతి హోళ్లికేరితో చర్చలు జరిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లకు 14వ తేదీన వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంపూర్ణ, అరుణ తెలిపారు. తమ కేంద్రాల్లో నిర్వహించే 14 రిజిస్టర్లకు గానూ, 9 రిజిస్టర్ల నిర్వహణను రద్దు చేయడంతోపాటు అన్ని రిజిస్టర్లను త్వరలో మాన్యువల్ చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ సిబ్బందికి బీమా సదుపాయం కల్పించడంతోపాటు ఆరోగ్యకార్డులు అందించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. సిబ్బందికి పదవీ విరమణ ప్రయోజనాలు, కారుణ్య నియామకాలు, పీఆర్సీ వంటి విషయాలు విన్నవించడంతో వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారని వెల్లడించారు.

### పనితీరు ఆధారంగా అవార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అప్లికేషన్ విధానంలో కాకుండా, ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారులు అంతర్గతంగా విచారణ జరిపి ఉపాధ్యాయుల జాబితాను ప్రభుత్వానికి అందజేయాలన్నారు. అప్లికేషన్ పెట్టుకునే విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

# సర్కారు బడుల్లో వృత్తి విద్య

- జిల్లాలో 10 పాఠశాలలు ఎంపిక
- స్వయం ఉపాధినిచ్చేలా కోర్సులు



కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులు(ఫైల్)

నిర్మల్ రూరల్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో నైపుణ్యానికి పదును పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చదువుతోపాటు విద్యార్థులకు ఇష్టమైన వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయి చదువు అనంతరం విద్యార్థులు నిరుద్యోగంతో బాధపడకుండా భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేలా ఈ కొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తున్నారు. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో నూతన హంగులు సమకూర్చాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ యోజన (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం) అనే కొత్త పథకాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధి చదువు(వృత్తివిద్య) అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల సంఖ్య, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల లభ్యత, అభ్యసనానికి సంబంధించిన వసతులు ఉన్న పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

**10 పాఠశాలలు ఎంపిక..**

వృత్తి విద్యా కోర్సుల ఏర్పాటుకు రాష్ట్రంలో మొత్తం 241 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో జిల్లా నుంచి 10 పాఠశాలలు ఉన్నాయి. 19 రకాల వృత్తి విద్యా కోర్సుల్లో స్థానికంగా డిమాండ్ ఉన్న వాటిని ప్రవేశపెట్టనున్నారు. ఒక్కో పాఠశాలలో రెండు కోర్సులను అందుబాటులోకి తెస్తారు. విద్యార్థుల ఆసక్తి మేరకు పాఠశాల ఆవాసంలో, సమీప పట్టణాలు, నగరాల్లో ఆదరణ ఉన్న 19 కోర్సుల నుంచి 2 ఎంపిక చేసుకుని ప్రధానోపాధ్యాయులు సమాచారం ఇస్తే ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇలా...**

జిల్లా వ్యాప్తంగా 735 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 59 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పీఎంశ్రీ పథకానికి మొదటగా యుడైస్ ప్రకారం 67 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో ఉన్న వసతుల వివరాలను ఆన్‌లైన్‌లో నివేదించారు. వారి నివేదిక ఆధారంగా జిల్లాస్థాయి బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పరిస్థితులపై ఆరాతీసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాయి. మూడు దశల్లో జరిగిన ఎంపిక ప్రక్రియలో చివరికి జిల్లాలో 19 పాఠశాలలు పీఎంశ్రీ కి అర్హత సాధించాయి. ఎంపికైన వాటిలో 2023- 24 విద్యా సంవత్సరం నుంచి 2026 -27 వరకు విడతల వారీగా ఈ పథకం అమలు చేయనున్నారు. అన్ని రకాల వసతుల కల్పనతోపాటు వృత్తివిద్య కోర్సులు ప్రవేశపెట్టనున్నారు.

**రెండు దశలుగా వృత్తివిద్య...**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రెండు దశలుగా వృత్తి విద్యను నేర్పించనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు మొదటి దశలో విద్యార్థులు నేర్చుకునేలా సంసిద్ధులను చేస్తారు. రెండో దశలో కిందటి తరగతిలో విద్యార్థులు పేర్కొన్న కోర్సులో తగిన శిక్షణ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసేనాటికి నేర్చుకున్న అంశంలో విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇస్తారు. ఇంటర్ వరకు విద్యాభ్యాసం ఉన్న విద్యాసంస్థల్లో రెండో దశలో మరికొంతకాలం వృత్తి విద్య కొనసాగిస్తారు.

### సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో వృత్తి విద్యను అమలు చేస్తాం. ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు చదువుతోపాటు ఉపాధి పొందేందుకు సంసిద్ధులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే 10 పాఠశాలలను ఎంపిక చేశాం. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో

### ఎంపికైన పాఠశాలలు ఇవే...

| మండలం | పాఠశాలలు |
|---|---|
| ఖానాపూర్ | మస్కాపూర్ ఉన్నత పాఠశాల |
| భైంసా | ఒవైసీనగర్ ఆశ్రమ పాఠశాల |
| లక్ష్మణచాంద | లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల |
| దిలావర్‌పూర్ | దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల |
| బాసర | బాసర ఉన్నత పాఠశాల |
| నిర్మల్ రూరల్ | ఈద్గా ఆశ్రమ ఉన్నత పాఠశాల |
| కడెం | బాలికల గురుకుల పాఠశాల, నచ్చన్‌ఎల్లాపూర్ |
| ముధోల్ | బాలుర గురుకుల పాఠశాల, ముధోల్ |
| సారంగాపూర్ | జామ్, బాలికల గురుకుల పాఠశాల |
| సోన్ | బాలికల గురుకుల పాఠశాల, లెఫ్ట్ పోచంపాడు |

# కొత్త రేషన్ కార్డు ఎప్పుడో..!

భైంసా పట్టణానికి చెందిన దిగంబర్ రోజు కూలీ. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. మూడేళ్ల కింద వివాహం కాగా, ప్రస్తుతం వీరికి ఒక కూతురు ఉంది. పెళ్లికి ముందు తల్లి రేషన్‌కార్డులో పేరు ఉండగా, అందులో నుంచి పేరు తొలగించుకుని కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటికీ కార్డు జారీ కాలేదు. దొడ్డు బియ్యం కిలోకు రూ.20 చొప్పున కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతున్నాడు.

భైంసా మండలం వానల్పాడ్‌కు చెందిన సంతోష్‌కు 2019లో వివాహమైంది. మూడేళ్ల క్రితం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. సంతోష్ చిన్నపాటి పనులు చేసుకుంటుండగా, భార్య బీడీలు చుడుతోంది. రేషన్ కార్డు ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు.

- జారీ చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- అలాంటిదేమీ లేదంటున్న మంత్రి గంగుల కమలాకర్
- ఏళ్లుగా నిరీక్షిస్తున్న దరఖాస్తుదారుల్లో నిరాశ

భైంసాటౌన్: కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలైందని, ఈనెల 21 నుంచి దరఖాస్తులు చేసుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ ఫారం ప్రచారం అవుతోంది. పలువురు ప్రజా ప్రతినిధులు కూడా పోస్ట్ చేస్తుండడంతో మంత్రి గంగుల కమలాకర్ స్పందించారు. అటువంటి ప్రచారం నమ్మవద్దని సూచించారు. దీంతో కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారు నిరాశకు లోనవుతున్నారు.

**పేర్ల నమోదుకూ...**

జిల్లా వ్యాప్తంగా ఇదివరకే రేషన్ కార్డులు ఉన్న వారు వారికి కలిగిన కూతురు, కుమారుడి పేర్లను కొత్త కార్డులో నమోదు చేసుకునేందుకు సైతం చాలా మంది ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు కూడా చేసుకున్నారు. పేర్ల నమోదుకు సంబంధించి 7,500, కొత్త కార్డులకు 29,744 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

### వివరాలిలా..

| | |
|---|---|
| రేషన్‌కార్డులు | 2,08,681 |
| లబ్ధిదారులు | 64,43,311 |
| కొత్తకార్డుల కోసం దరఖాస్తులు | 29,744 |
| పేర్లచేర్పులు | 40,842 |
| ఇన్‌స్పెక్టర్ స్థాయిలో పెండింగ్ | 15,128 |
| తహసీల్దార్ స్థాయిలో | 1,442 |
| డీఎస్‌వో స్థాయిలో | 7,501 |
| అప్రూవ్ అయింది | 5,222 |
| తిరస్కరించినవి | 451 |

### ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

పెంబి: ఈనెల 27న పెంబి మండలానికి ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం వస్తుందని, ఈమేరకు ఏర్పాట్లు చేయాలని డీఎల్‌పీవో రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పర్యటించారు. ఈనెల 27 నుంచి వారంపాటు ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం మండలంలో పర్యటిస్తుందని పేర్కొన్నారు. వారికి అన్ని వసతులు కల్పించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# 'ప్లాన్'పై ఆమ'రణం'

- నాలుగురోజు.. 'ఏలేటి' దీక్ష
- గంటగంటకూ వైద్యపరీక్షలు
- మంత్రి స్పందించకపోవడంపై బీజేపీ ఆగ్రహం
- బస్టాండ్ ఏరియాలో రాస్తారోకో, పోలీసుల లాఠీచార్జీ



ఏలేటికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

నిర్మల్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్‌పై ప్రతిపక్షాలు, బాధిత రైతులు కొనసాగిస్తున్న పోరు వేడెక్కుతోంది. ప్లాన్ రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష శనివారం నాలుగోరోజుకు చేరింది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యులు తెలిపారు. గంటగంటకూ వైద్య పరీక్షలు చేస్తుండటంతో నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఈక్రమంలోనే సాయంత్రం ఒక్కసారిగా సీనియర్ నాయకులు, కార్యకర్తలంతా రోడ్డుపైకి వచ్చారు.

**రద్దు చేయాలంటూ..**

నిర్మల్ బస్టాండ్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో బీజేపీ నేతలు అక్కడే బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ వెంటనే వచ్చి జీవో 220ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓవైపు మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

**చెదరగొట్టిన పోలీసులు..**

ప్రధాన రహదారిపై బైఠాయించిన బీజేపీ నేతలు ఎంతకూ కదలకపోవడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. సీనియర్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందులో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, మల్లికార్జున్‌రెడ్డి, మెడిసెమ్మెరాజు, రాజేశ్వర్‌రెడ్డి, తక్కల రమణారెడ్డి, నాయిడి మురళి, ఒడిసెల అర్జున్, వెంకటేశ్, అరవింద్, విలాస్ పాల్గొన్నారు. పోలీసుల లాఠీచార్జీ, బలవంతంగా లాక్కెళ్లడంతో పలువురు గాయపడ్డారు.



మల్లికార్జున్‌రెడ్డిని లాక్కెళ్తున్న పోలీసులు

### రెండోరోజూ రైతుల దీక్ష

నిర్మల్: మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండోరోజూ శనివారం కొనసాగింది. ఓ వైపు వర్షం కురుస్తున్నా టెంట్ కిందే కూర్చున్నారు. తమ పంట భూములను దెబ్బతీసేలా ఉన్న మాస్టర్‌ప్లాన్ పూర్తిగా రద్దయ్యేవరకూ దీక్ష కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్లాన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం ఆమరణ దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి పలువురు రైతులు సంఘీభావం తెలిపారు.

### ప్రజల కోసమే 'ఏలేటి' దీక్ష..

- వివేక్ వెంకటస్వామి

నిర్మల్ ప్రజల సంక్షేమం కోసమే మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి అన్నారు. పార్టీ సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన శనివారం మహేశ్వర్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వివేక్ మాట్లాడుతూ తన ఆస్తులు అమ్ముకుని మరీ మహేశ్వర్‌రెడ్డి ప్రజల కోసం పోరాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రి కుట్రపూరితంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారని ఆరోపించారు. పేదల భూములను తక్కువ ధరకు కొట్టేసి, తర్వాత జోన్లు మార్చుకుని ఎక్కువ లాభాలు గడించడం దారుణమన్నారు. నిర్మల్ రైతులు, నాయకులు దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని సూచించారు. బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి, మంజులాపూర్, విశ్వనాథ్‌పేట్, గాజులపేట్ తదితర ప్రాంతాల రైతులు మహేశ్వర్‌రెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపారు.

# ఉపాధి లడ్డూ!



ఇతరులపై ఆధారపడకుండా తమకంటూ ఓ గుర్తింపు కోసం ఆదివాసీ మహిళలు ఒక్కటయ్యారు. ఆదివాసీ భీంబాయి సంఘం పేరుతో ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పపువ్వు లడ్డూల తయారీపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం ఆర్డర్లపై లడ్డూలను సరఫరా చేస్తున్నారు. ఆదివాసీ మహిళల్లోని రక్తహీనత నివారణకు వీరు తయారుచేసిన ఇప్పపువ్వు లడ్డూ ఎంతగానో దోహదం చేస్తుందని ఐటీడీఏ అధికారుల నుంచి మెప్పు పొందారు. 12 మంది మహిళలు సభ్యులుగా సంఘం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– ఉట్నూర్‌రూరల్

**ఉట్నూర్ ఐటీడీఏ సహకారంతో...**

2019లో 12 మంది మహిళలు ఐటీడీఏ సహకారంతో ఇప్పపువ్వు లడ్డూ తయారీకి కావాల్సిన పరికరాలకు రూ.14 లక్షల యూనిట్‌తో సామగ్రిని కొనుగోలు చేసి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని ఐటీడీఏ పరిశ్రమలో ఆహార కేంద్రాన్ని ప్రారంభించారు. కరోనా సమయంలో తయారీని నిలిపివేసి ప్రస్తుతం తమ వ్యాపారాన్ని మళ్లీ ప్రారంభించారు.



లడ్డూల తయారీలో ఆదివాసీ మహిళలు

- ఇప్పపువ్వుతో తయారు చేస్తున్న ఆదివాసీలు
- 12 మంది సంఘంగా ఏర్పడిన మహిళలు
- తయారీపై మహారాష్ట్రలో శిక్షణ
- ఐటీడీఏ సహకారంతో యూనిట్ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం సరఫరా

సండే స్పెషల్

**లడ్డూ తయారీ ఇలా..**

పోషక విలువలతో కూడిన డ్రైఫ్రూట్స్‌తో పాటు ప్రకృతి ప్రసాదించిన ఇప్పపువ్వుతో ఈ లడ్డూలను తయారు చేస్తున్నారు. ఇప్పపువ్వును ఎండబెట్టి నూనెలో ఫ్రై చేసి ఎండబెట్టిన అనంతరం కిష్మిష్, బాదం, యాలకుల పొడి, ఇప్పపువ్వు, పల్లీలు, బెల్లం కలిపి లడ్డూలను తయారు చేస్తారు. వాటిని ఆదిలాబాద్ న్యాచురల్ దుకాణాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లాకు సైతం సరఫరా చేస్తున్నారు. ఆర్డర్లపై తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. క్వింటాల్ లడ్డూలకు రూ.20 నుంచి 25వేల వరకు ఆదాయం వస్తుందని వారు పేర్కొంటున్నారు. వీటి తయారీ కోసం మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలో మూడు రోజుల పాటు శిక్షణ సైతం తీసుకున్నారు.

**ఉపాధి దొరికింది..**

ఖాళీగా ఉండకుండా గ్రూపుగా ఏర్పడి లడ్డూల తయారీని ఎంచుకున్నాం. ఐటీడీఏ సహకారంతో సామగ్రిని కొనుగోలు చేసి లడ్డూ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. తాము చేస్తున్న లడూడ్ల ఎంతో పోషక విలువలతో కూడినవి. అధికారులు గుర్తించి తమ లడ్డూలను అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించాలి. చిన్నారులకు, రక్తహీనత ఉన్న వారికి మంచి ఫలితాలు వస్తాయి.

– బాగ్‌బాయి, ఆదివాసీ భీంబాయి సంఘం అధ్యక్షురాలు

**మంచి పోషకాహారం**



పోషక విలువలతో కూడిన పదార్థాలతో ఈ లడ్డూను తయారు చేస్తున్నాం. రక్తహీనత నివారణకు ఎంతగానో దోహదపడుతాయి. తాము తయారుచేసిన లడ్డూలు ప్రతీ ఒక్కరు మెచ్చుకుంటున్నారు. తమ లడ్డూలను ఆదిలాబాద్, అనంతపూర్ నుంచి ఆర్డలతో పాటు ఎవరైన ఆర్డర్ ఇస్తే తయారు చేసి అందిస్తున్నాం. కిలో లడ్డూలకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నాం.

– మెస్రం గంగుబాయి , సంఘం సభ్యురాలు

**పైలట్ ప్రాజెక్ట్‌గా...**

ఈ లడ్డూలను పరిశీలించిన అధికారులు పైలట్ ప్రాజెక్టు కింద గర్భిణులకు పంపిణీ చేయాలని ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌లో 150 మంది, కుమురంభీం జిల్లాలో 150 మంది గర్భిణులకు ఈ లడ్డూలను కలెక్టర్, ఐటీడీఏ పీవో అధ్యక్షతన పంపిణీ చేశారు. ఇవి రక్తహీనత నివారణకు ఎంతో దోహదపడ్డాయని గుర్తించారు.




ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని ఆదివాసీ ఆహార కేంద్రం





లడ్డూ తయారీకి సిద్ధం చేసిన ఇప్పపువ్వు, పల్లీలు



తయారు చేసిన ఇప్ప పువ్వు లడ్డూలు

## క్లుప్తంగా

### టీజీవో జిల్లా అధ్యక్షురాలిగా వనజారెడ్డి



నియామకపత్రాన్ని అందుకుంటున్న వనజారెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా కె.వనజారెడ్డి నియామకమయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు మమత ఆమెకు నియమాకపత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తు సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

### జగదాంబ ఆలయాల్లో చోరీ



పెంబితండాలో చోరీకి గురైన ఆలయం

పెంబి: మండలంలోని పెంబితండా, ఇటిక్యాల్‌తండా, తోతర్యతండా గ్రామాల్లోని జగదాంబ ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఆయా గ్రామాల ప్రజలు గుర్తించారు. అర్ధతులం బంగారం, వెండి అపహరణకు గురైందని వాపోయారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

### యువకుడి అదృశ్యం



షేక్‌షోయబ్ (ఫైల్)

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన షేక్ షోయబ్(22) కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలి పారు. ఆయన వివరాల ప్రకారం... శేక్ రిహానా – జైనుద్దీన్ దంపతుల రెండో కుమారుడు షోయబ్‌కు నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజులపేట్ గ్రామానికి చెందిన యువతితో రెండు నెలల క్రితమే వివాహమైంది. వారిద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో పెద్దమనుషుల సమక్షంలో విడిగా కాపురం ఉంచాలని నిర్ణయించారు. షోయబ్ ఈనెల 15వ తేదీన గాజులపేట్‌లోని అత్తగారింటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆ తర్వా త తిరిగి ఇంటికి రాలేదు. షోయబ్ అత్తారింటికి ఫోన్ చేసి మాట్లాడగా ఇక్కడికి రాలేదని తెలిపారు. తల్లి రిహానా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

### వృద్ధురాలికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బురుగూడ గ్రామానికి చెందిన వృద్ధురాలు మల్లమ్మపై శనివారం వీధికుక్కలు దాడిచేయడంతో గాయాలయ్యాయి. ఉదయం ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా ఒక్కసారిగా కుక్కల గుంపు ఆమెపై దాడిచేసింది. సమీపంలో ఉన్న పలువురు కుక్కలను తరిమేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలపాలైన వృద్ధురాలిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### దూరవిద్యలో డిగ్రీ, పీజీలో దరఖాస్తులు

ఉట్నూర్‌రూరల్: చదువును మధ్యలోనే మానేసిన విద్యార్థులకు దూర విద్యలో డిగ్రీ, పీజీలు చదువకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూర విద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, డిగ్రీ, పీజీలలో చదువుకునేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, డిగ్రీ, పీజీ చేరే విద్యార్థులు ఫీజులను గూగుల్‌పే, ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేస్తే కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. కళాశాలకు వచ్చి తప్పనిసరిగా రశీదు పొందాలని కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు సంవత్సరాల నుండి దూర విద్య కేంద్రం రద్దు చేశారని, ఆ కళాశాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి అడ్మిషన్లకు తాము బాధ్యులము కాదని వివరించారు. ఇతర వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

### బెల్లంపల్లి కేవీకేకు జోనల్‌స్థాయి అవార్డులు




అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌నాయక్

బెల్లంపల్లి: వ్యవసాయరంగాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయంచేసి ప్రోత్సహిస్తున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి నాలుగు జోనల్‌స్థాయి అవార్డులు వరించాయి. కోయంబత్తూర్‌లోని వ్యవసాయ వర్సిటీలో ఈ నెల 17 నుండి 19 వరకు తెలంగాణ, ఏపీ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 79 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ సమావేశాలు నిర్వహించారు. గతేడాది బెల్లంపల్లి కేవీకే నిర్వహించిన అంశాలను సమావేశాల్లో ప్రదర్శించారు. వ్యవసాయంలో సాంకేతికతను ప్రతిబింబించేలా తీసిన ఛాయా చిత్రానికి అవార్డులు దక్కినట్లు బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్ నాయక్ తెలిపారు. ఈమేరకు ఆయన అవార్డులను అందుకున్నారు.

## వరదలో కొట్టుకుపోయి ఎడ్లు మృతి



మృతి చెందిన ఎడ్ల కళేబరాల వద్ద రైతు

సిరికొండ: వాగులో కొట్టుకుపోయి రెండు ఎడ్లు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని చిక్‌వాగు వద్ద జరిగింది. బాధిత రైతు వివరాల ప్రకారం... కొండపూర్ గ్రామానికి చెందిన మంగ చిన్న అశన్న వ్యవసాయ పనులు ముగించుకుని ఎడ్లను ఇంటికి తరలిస్తుండగా మార్గమధ్యలోని చిక్‌మనా వాగు దాటే క్రమంలో రెండు ఎడ్లు వాగులో కొట్టుకుపోయి మృతి చెందాయి. మృతి చెందిన ఎడ్ల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని రైతు పేర్కొన్నాడు.



వరద నీటిలో మునిగి ఉన్న ఎడ్లు

**కడెం వాగులో.. రెండు**

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని తరడపు శంకర్‌కు చెందిన రెండు ఎడ్లు గ్రామం సమీపంలోని కడెం వాగు వరదలో మునిగి మృతి చెందాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... తరడపు శంకర్ గురువారం ఉదయం చేనులో పశుగ్రాసం కోసం రెండు ఎడ్లను తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వెళ్తూ కడెం వాగు దాటుతుండగా వరద నీటిలో కొట్టుకుపోయి వాటికి కట్టిన తాడుతో వాగు మధ్యలో ఉన్న చెట్టుకు తట్టుకుని నిలిచిపోయాయి. దీంతో వరదలో కొట్టుమిట్టాడుతూ మృతి చెందాయి. వాటి విలువ రూ.1.10 లక్షల వరకు ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

### మత్తడివాగు గేటు ఎత్తివేత



దిగువకు వెళ్తున్న వరద

తాంసి: మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి వరద నీటిని దిగువకు వదిలారు. శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరడంతో శనివారం ప్రాజెక్టు గేటును ఎత్తి నీటిని వదిలారు. వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 840 క్యూసెక్కుల వరద నీరు చేరగా ప్రాజెక్టు గేటును ఎత్తి 1550 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 277.30 మీటర్ల వద్ద నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 0.571 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.544 టీఎంసీల వద్ద నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు.

### తృటిలో తప్పిన ప్రమాదం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సిరిచెల్మ బైపాస్ రోడ్డులోని తాత్కాలిక వంతెన వద్ద వాగులో పడిన యువకుడు తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని జల్దా గ్రామానికి చెందిన రాహుల్ అనే యువకుడు మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం జల్దా నుంచి ఇచ్చోడకు వస్తుండగా తాత్కాలిక వంతెన వద్ద బైక్‌ను దాటిస్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌తో సహా వాగులో పడిపోయాడు. వరదలో కొట్టుకుపోతుం డగా స్థానికులు గమనించి కాపాడారు. దీంతో యువకుడు ప్రాణాలతో బయటపడ్డాడు.

### పేకాట స్థావరంపై దాడులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు కెరమెరి మండలంలోని హట్టి గ్రామంలో శనివారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,400 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

## ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ కోర్సులపై అవగాహన



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంజినీరింగ్ కోర్సులపై శనివారం అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సూచనతో ఏఐసీటీఈ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల కోసం 2 వారాల ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 2 వరకు వివిధ రంగాల్లో నిష్ణాతులతో సదస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఏడు ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయని, విద్యార్థుల ఆయా విభాగాల్లో ఉన్న ప్రత్యేకత, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్య అవకాశాల గురించి తెలుసుకోవడానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయని వివరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు సదస్సుల్లో ఆయా కోర్సుల ప్రత్యేకతను తెలియజేస్తారని తెలిపారు. ఉత్తమమైన ఇంజినీరింగ్ విద్యార్థి అవ్వడానికి రెండు వారాలపాటు జరిగే అవగాహన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభ సెషన్‌లో అసోసియేట్ డీన్స్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అసోసియేట్ డీన్, అసోసియేట్ డీన్‌లు ఏడు ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల వివిధ కారణాలతో ఐదుగురు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.



దస్లీబాయి మృతదేహం



నాందేవ్ మృతదేహం

గుడిహత్నూర్: వృద్ధురాలు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ దస్లీబాయి(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. శుక్రవారం రాత్రి కోడలు ఆమె గదిలో భోజనం పెట్టి వచ్చింది. కొద్ది సేపటికి వెళ్లగా తలుపులు మూసి ఉండడంతో భర్తకు సమాచారం ఇచ్చింది. వెంటనే అతడు చేరుకుని గది తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. స్థానికుల సహాయంతో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందింది.

**మన్నూర్‌లో పాలేరు..**

మండలంలోని మన్నూర్ గ్రామంలో పాలేరుగా పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన తోరకడ్ నాందేవ్ (31) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాందేవ్ కుటుంబ సభ్యులతో రెండేళ్ల క్రితం వలస వచ్చి శ్రీనివాస్ ముండే వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన నాందేవ్ నిత్యం మద్యం తాగివచ్చి ఇంట్లో గొడవపడుతుండడంతో భార్య విమల మందలించింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాక పోవడంతో భార్య యజమానికి తెలిపింది. ఉదయం చేనులో విగతజీవిగా కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

**ఉరేసుకుని యువకుడు..**

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన గైక్వాడ్ క్రిష్ణ (27) ఉరేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గైక్వాడ్ క్రిష్ణ కూలీ పనులు చేసుకుంటూ ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. మద్యానికి బానిసైన క్రిష్ణ శనివారం ఉదయం మద్యం మత్తులో ఆ మహిళతో గొడవకు దిగాడు. దీంతో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఉరేసుకుని కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

**ఉరేసుకుని మహిళ..**

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన తోకల గంగవ్వ(50) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు .... మండల కేంద్రానికి చెందిన తోకల గంగవ్వ(50)కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూతురు పెళ్లికి, ఇంటి నిర్మాణానికి అప్పు చేసింది. ఇంటిపై ప్రైవేట్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకుంది. అయితే అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి పెద్దకొడుకు తోకల విలాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

**మనస్తాపంతో పురుగుల మందుతాగి..**

దండేపల్లి(మంచిర్యాల): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గొర్రె పోషయ్య (42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## పార్సిల్ సర్వీస్ పేరిట మోసం

- రూ.18,480 నష్టపోయిన బాధితుడు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

మందమర్రిరూరల్(చెన్నూర్): పార్సిల్ సర్వీస్ పేరిట తనకు మోసం జరిగిందని పట్టణానికి చెందిన గజ్జనాల శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు గతేడాది జూన్ 27న మీ షో పార్సిల్ సర్వీస్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేసి మీకు తప్పుడు పార్సిల్ వచ్చిందని ఎస్బీఐ డెబిట్‌కార్డు వివరాలు తెలియజేస్తే రిఫండ్ చేస్తామని చెప్పాడు. అతని మాటలు నమ్మి వివరాలు చెప్పడంతో రూ.4,900లు కట్ అయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు మీ షో కస్టమర్ కేర్ సెంటర్‌కి ఫిర్యాదు చేయగా క్రెడిట్ కార్డు నంబర్ తెలియజేస్తే ఒక అప్లికేషన్ పంపిస్తాం దాన్ని స్కాన్ చేస్తే మీ డబ్బులు రిఫండ్ అవుతాయని చెప్పి అప్లికేషన్ పంపించారు. అప్లికేషన్ స్కాన్ చేయగా మళ్లీ రూ.13,580 కట్ అయ్యాయి. మళ్లీ మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి వివరాలు చెప్పవద్దని, ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సీఐ సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR

■ Direct Final Year: Discontinued (or) Fail Degree; P.G, LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc అగ్రి, నర్సింగ్ BPT, MPT, Phd. Cell: 9951627995, 8885404396 [W-785649]

REAL ESTATE
PLOT FOR SALE

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్లమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

SERVICES
BUSINESS OFFER

■ స్త్రీ/పురుషులు, చిన్న పెట్టుబడితో ప్రతినెల 25000/- ఫిక్స్‌డ్ వేతనంతో పాటు మీకు సరిపడ ఆదాయం పొందండి. ఫోన్ : 7386425653, 7416087357 [H-189383]

WANTED

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీలో పనిచేయుటకు కావలెను. తగిన విధంగా సంపాదించుకునే అవకాశం స్మార్ట్ ఫోన్ వుండాలి, పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 9059610687, 9346764605, 9010555733 [W-1229254]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్స్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]

■ గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసెన్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్, వ్యవసాయం లో అనుభవం ఉన్న సీనియర్ సూపర్ వైజర్ కావలెను. PVC ప్రాజెక్ట్స్, Call Mon-Sat 11am-5pm on 040-23338080, 8686417794 [H-781265]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,